## ఎగిరే వృక్షాలు

బారు శ్రీనివాసరావు

కుదుళ్లకు, దడి కట్టిన వేదుళ్ళకు
రంగురంగుల తొట్టికి, రకరకాల మట్టికి
వృక్షాలు ఎదుగుతాయా?

గాలి వాటానికి, గుంపు వ్యూహానికి
ఇక్కడ చలికి వెరసి, ఎక్కడో ఎండకు మురిసి
పక్షులు ఎగురుతాయా?

తలెత్తుకు తిరగాలనే అంతరాత్మ పిలుపు
తన ఉనికిని చాటాలన్న అణచరాని తలపు
భూమిని చీల్చే ఉత్సాహాన్ని వృక్షంలో నింపుతుంది
భూమ్యాకర్షణను కాదని పక్షిని ఆకాశానికి  పంపుతుంది

విత్తును కమ్ముకున్న మట్టే
చెట్టుగా దానిని ఎదగనిస్తుంది
బిడ్డను రెక్కల్లో దాచే పక్షే
దానిని నింగికి ఎగరమంటుంది

మట్టి, పక్షులు మనకు చెబుతాయి ప్రతి నిత్యం
వేళ్ళు , రెక్కలు ఇవ్వడమే  పెంపకమన్న సత్యం

★★★

# అకాలపు సంతకం — అనూరాధ బండి

ఇంత నిశ్శబ్దావస్థ మిధ్య కాదని తెలుసుకోవాలి.
భ్రమావరణ జననాలిక కద్దు.

భ్రాంతిని తూకమెయ్యలేమని
వివేకం గగ్గోలు పెడుతున్నప్పుడు
విచక్షణా గొడ్డలికి పనిచెప్పాలి.

మాలిమయ్యిందని వైరాగ్యాన్నే భుజిస్తే
విషాదాలన్నీ బూడిదపాలే.

సవివరాల పుస్తకాన్ని లిఖిస్తున్న మనసుకి
హృదయాన్ని పరవాలి మస్తిష్క కలంతో.

పురలన్నీ, మరణించిన గత క్షణపు జ్ఞాపకాలని
తెలిస్తే చాలు..
ఎన్ని రచనలైనా కాలంలో మెలిపించొచ్చు.

మంచు అగ్నిని కురిపించినట్లు భావిస్తే
ఆజ్యం పోయని ఆలోచనల్ని కనడమో కళే.

సవరణలకాలం ముగిసిన తరుణాన
కౌగిలింతలకు నిశీథి సిద్ధమేనని
'నిశ్శబ్దం' అందుకు సాక్ష్యమని
అనుభవసారం వంటబట్టించుకున్న జీవులకు విదితమే.

రంగులన్నీ, రంగవల్లులుగా
దేహాన్ని హత్తుకున్నప్పటి సౌకర్యం,
'తెలుపు నలుపు' కొలతల్లో లేదెందుకో.

విషాదం కొత్తకాదు; అలవాటయినా పాతదే.
అయితే, నిర్వేదాస్త్రాలూ అవిచ్ఛిన వస్త్రాలూ
ఎప్పటికీ ఇక గాజుతెరల వెనక నిర్జీవ కళాఖండాలే..

ఇప్పుడో పుట్టుక ఇక్కడని ఎవరికిమాత్రమెరుకా!..
సజీవ శిల్పాన్ని కూకటివేళ్ళతో పెకిలించి
శూన్య అగాధాల్లో పరిభ్రమింపజేయడమే
ఆ జననమెనక రహస్యమనికూడా
కాంతిని కోల్పోయిన కొందరికే తెలుసు.

నానావిధవర్ణభరిత పువ్వులను పూయించే ఆ చెట్టిక..
వర్ణాంధత్వంతో బుద్ధిమాంద్యంలోకి నెట్టివేయబడింది కదా...!!

# దుఃఖసంయోగవియోగం – యోగసంజ్ఞితం

## అయ్యగారి లక్ష్మణరావు

కష్టమొచ్చి నేనుంటే
ఏడవడం నా ఇష్టం
నా కష్టం నీ కొస్తే
నీకప్పుడు తెలుస్తుంది
ఇదే ఇదే ఇదే ఇదే
విన్నకొద్ది ఇదే ఇదే

ఏడవడం పాడవడం
పాడవడం ఏడవడం
ఏడుస్తూ పాడవడం
పాడౌతూ ఏడవడం

వాడెవడో వున్నాడని
కాపాడూ నన్నంటూ
గుడి లోపల ఉన్నాడని
ఎన్నెన్నో గుడులన్నీ
వడి వడిగా తిరగడం
విడి విడిగా చూడడం

హడావిడే ఇదంతా
విడబడేది అదెల్లా !!

గీతకేసి చూడు చూడు
చూసి చూసి మరీ చూడు

"ఏడ్చి ఏడ్చి కూలిపోయి
కర్తవ్యం ఏమరించి
మతి పోయి గతి లేక
అర్జునుడు అనే వాడు

శరణాగతి అన్నప్పుడు
మనకోసం అన్నమాట
వాడెవడో పోతాడని
వాడెవడో పోయాడని
నీ కెందు కు ఈ ఏడుపు

నవ్వినట్టుగా వున్నా
గట్టిగానే అన్నాడు
గిత లోని శ్రీ కృష్ణుడు
తృష్ణ అనే కీడు వలన
మృషా మయం
మన బ్రతుకులు
కప్పి ఉన్న మాయవాంక
కళ్ళు విప్పి చూడవేమి

ఒక్కసారి విన గాని
లోతుగాను చూసేవా
నిక్కంగా పక్కంగా
వేద వ్యాసుడనేవాడు
ఏమి చెప్పి ఉన్నాడని

పొద్దు పొద్దు నీలోనే
హద్దులేని అలజడి
వద్దు వద్దు అనుకున్నా
సద్దు పడని వేడి
తీరాలని అనుకుంటే
జ్ఞానమనే మందు
అది ఒక్కటి ఒక్కటే
ఈ వ్యాధికి విరుగుడని !! ★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

జీవితపుటంచుకు నేను చేరినపుడు
నిండునానందమేల నా నెమ్మనమున?
కరగిపోయిన కాలంపు కమ్మదనమొ!
సంతతమ్ము నా హృది నిండు సమ్మదమ్మొ!

ఎన్ని సారులుప్పొంగె నా హృదయసీమ
ఎగసివచ్చెను కన్నీళ్ళవెన్ని మార్లు
బంధఫలితమే ముదమైన బాష్పమైన
బంధములు కాకనేముండు బ్రతుకునందు

అందరును మనవారలే యవని యందు
ప్రేమ పంచెడు వారు, నొప్పించు వారు,
చేరదీసెడు వారు, వంచించు వారు
పెక్కుటనుభవమ్ములను కల్పించుచుండ్రు

రాళ్ళు నొప్పించు, నొప్పించు ముళ్ళ దార్లు
పూలు ముదమిచ్చు, ముదమిచ్చు పులుగు పాట
హితము కోరెదరెపుడు స్నేహితులు మనకు
అన్నులిత్తురు వేరైన యనుభవముల

పూలు వలయును, వలయును రాలు గూడ
మిత్రులు వలయు, తప్పరు శత్రువులును
వలయు నీరము, వలయును వహ్ని గూడ
వలయునన్నియు పూర్ణమౌ బ్రతుకునందు

COMMENTS